పోస్టల్ బ్యాలెట్ కేంద్రం పరిశీలన

బ్యాలెట్ కేంద్రంలో ఏఆర్‌వోను వివరాలు అడిగి తెలుసుకున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

మియాపూర్, మే 3 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో శుక్రవారం ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ఎనిమిదో తేదీ వరకు కొనసాగనున్నది. ఈ మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గ ఏఆర్‌వో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రంతోపాటు స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎన్నికల అధికారి(ఆర్‌వో), కలెక్టర్ శశాంక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌కు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల వివరాలు, కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతులను ఏఆర్‌వో స్నేహ శబరీశ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్ట్రాంగ్‌రూమ్ భద్రతకు చేపట్టిన చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌వో శాంక మాట్లాడుతూ.. పోస్టల్ బ్యాలెట్ ద్వారా వేసిన బ్యాలెట్ పేపర్లతోపాటు శనివారం నుంచి మూడురోజులపాటు కొనసాగనున్న హోం ఓటింగ్ బ్యాలెట్ పత్రాలను కూడా స్ట్రాంగ్‌రూమ్‌ల్లో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రపరిచి సీల్ వేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లకు తగు పోలీసు బందోబస్తు కల్పించాలని.. హోం ఓటింగ్‌నూ అత్యంత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఓటర్లకు విధిగా ఓటరు స్లిప్పులను అందించాలని, బీఎల్‌వో సూపర్ వైజర్లు సహా సంబంధిత అధికారులు ఈ ప్రక్రియను పటిష్టంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. నియోజకవర్గంలో ఓటింగ్ ప్రక్రియకు చేపడుతున్న చర్యలను ఏఆర్‌వో స్నేహ శబరీశ్ ఆర్‌వోకు వివరించారు. కార్యక్రమంలో ఈఆర్‌వో రజనీకాంత్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, ఏఈఆర్‌వో వంశీకృష్ణ పాల్గొన్నారు.

❖ లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు నియోజకవర్గ ఏఆర్వో స్నేహ శబరీశ్ పేర్కొన్నారు. ప్రతి ఓటరుకూ ఓటరు స్లిప్పులను అందిస్తున్నామన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఓటరు స్లిప్పుల పంపిణీని ఏఆర్‌వో ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్లిప్పుల పంపిణీలో బీఎల్‌వోలు పకడ్బందీగా పని చేయాలని, నిర్లక్ష్యాన్ని సహించబోమని ఆయన హెచ్చరించారు.

❖ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో జిల్లా ఎన్నికల అధికారి(ఆర్‌వో), జిల్లా కలెక్టర్ శశాంక శుక్రవారం పర్యటించారు. నియోజకవర్గంలోని ఖాజాగూడ, రాయదుర్గంలలో పలు పోలింగ్ కేంద్రాలను ఆర్‌వో పరిశీలించి వసతులను తనిఖీ చేశారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలుగకూడదని పూర్తి స్థాయిలో వసతులను కల్పించాలని ఈఆర్‌వో, డీసీ రజనీకాంత్‌రెడ్డి, అధికారులను ఆదేశించారు.

జీహెచ్‌ఎంసీలో.. ఇక డిజిటల్ పేమెంట్స్

సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ ఎంసీలో ఈ- పేమెంట్స్ విధానాన్ని ప్రవేశపెట్టింది. మ్యూస్‌వల్ చెక్కుల విధానానికి స్వస్తి పలుకుతూ కమిషనర్ రొనాల్డ్‌రాస్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం డిజిటల్ పేమెంట్స్ ప్రక్రియను ప్రారంభించారు. సంస్థకు సంబంధించి ఉద్యోగుల జీతాలు, పింఛన్లు, ఇతర పేమెంట్లు డిజిటల్ పేమెంట్ (ఈ-పేమెంట్స్) రూపంలోనే అందనున్నాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమన్వయంతో జీహెచ్‌ఎంసీ డిజిటల్ పేమెంట్స్ జరుపనున్నది.

బీఆర్ఎస్ పార్టీకే చేవెళ్ల జై..

- చేవెళ్లలో హ్యాట్రిక్ విజయం బీఆర్ఎస్‌దేనంటున్న ఓటర్లు
- గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో విజయదుందుభి
- ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో గులాబీకి అనుకూల పవనాలు
- కాంగ్రెస్, బీజేపీలకు ఓటమి తప్పదంటున్న ఓటర్లు
- చేవెళ్ల లోక్‌సభలో మొత్తం ఓట్లు **29,39,057**
- 2019లో పోలైన **53.25** శాతం ఓట్లలో..
  40.62 శాతం ఓట్లతో బీఆర్ఎస్ గెలుపు
- 2014లో పోలైన **60.51** శాతం ఓట్లలో..
  - **33.1**శాతంతో గులాబీ రెపరెపలు

సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల.. ఈ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో కంచుకోటగా ఉన్నది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇక్కడ జరిగిన రెండు లోక్‌సభ ఎన్నికల్లోనూ చేవెళ్ల ప్రజలు గులాబీ పార్టీకే జై కొట్టారు. అభ్యర్థులు ఎవరున్నా.. కేవలం బీఆర్ఎస్ పార్టీని చూసి జనం ఓట్లు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఇప్పుడు మళ్లీ హ్యాట్రిక్ విజయం అందించి రికార్డు సృష్టించడానికి సిద్ధంగా ఉన్నామంటూ చేవెళ్ల ప్రజలు నినదిస్తున్నారు. 2014, 2019లో చేవెళ్ల లోక్‌సభ బరిలో కాంగ్రెస్, బీజేపీలను మట్టి కరిపించి గులాబీ జెండా రెపరెపలాడింది. తొలుత 2014లో బీఆర్ఎస్ నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపొందారు. అతను పార్టీకి రాజీనామా చేసి మళ్లీ 2019లో కాంగ్రెస్ తరపున బరిలో దిగారు. ఆ సమయంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ప్రజలు ఓటుతో జవాబు చెప్పారు. బీఆర్ఎస్ నుంచి బరిలో ఉన్న రంజిత్ రెడ్డిని గెలిపించి గులాబీ పార్టీ దమ్ము చూపించారు. అప్పటి వరకు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తన వ్యక్తిగత ఇమేజ్‌ని చూసి మొదటిసారి గెలిచానని భ్రమలో ఉన్న అతడికి చేవెళ్ల ప్రజలు చురకలు పెట్టారు. ఇదే క్రమంలో ఇప్పుడు జరిగే లోక్‌సభ ఎన్నికల్లో రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్నారు.

రంజిత్‌రెడ్డి కూడా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాదిరిగానే ఓటమి రుచి చూసేందుకు సిద్ధంగా ఉండాలని చేవెళ్ల ప్రజలు స్పష్టం చేస్తున్నారు. చేవెళ్ల నుంచి బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ బీఆర్ఎస్ నుంచి బరిలో ఉన్నారు. ఇప్పటికే అన్ని వర్గాల నుంచి అతడికి ఆదరణ లభించింది. చేవెళ్ల లోక్‌సభ విస్తరించి ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, పరిగి, తాండూరు, వికారాబాద్‌లో గులాబీ గాలులు బలంగా వీస్తున్నాయి. దీనికి తోడు చేవెళ్ల లోక్‌సభ బీఆర్ఎస్ కంచుకోటగా ఉండటం.. రెండుసార్లు బీఆర్ఎస్ జెండా ఎగిరిన ప్రాంతం కావడంతో కాసాని గెలుపు ఖాయంగా కనిపిస్తున్నదని రాజకీయ నిపుణులు సైతం విశ్లేషిస్తున్నారు.

చేవెళ్ల లోక్‌సభ స్వరూపం..!

మొత్తం ఓటర్లు	29,39,057
పురుషులు	14,92,799
స్త్రీలు	14,22,401
ట్రాన్స్‌జెండర్స్	277

చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో గులాబీ విజయం ఇలా..!

2014 లోక్‌సభ బరిలో..!

పార్టీ	పోలైన ఓట్లు	శాతం
బీఆర్ఎస్	4,35,077	33.1
కాంగ్రెస్	3,62,054	27.8
టీడీపీ కూటమి	3,53,203	26.8
పోలైన ఓట్లు	13,22,312	60.51శాతం

2019 లోక్‌సభ బరిలో..!

పార్టీ	పోలైన ఓట్లు	శాతం
బీఆర్ఎస్	5,28,148	40.62
బీజేపీ	2,01,960	15.53
కాంగ్రెస్	5,13,831	39.5
పోలైన ఓట్లు	13,00,998	53.25 శాతం

కాసానికి బాసటగా నిలుస్తాం

చేవెళ్లలో విజయబావుటా ఎగురవేస్తాం

బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కే మా మద్దతంటున్న బీసీ సంఘాలు

బీసీలను చిన్నచూపు చూస్తున్న కాంగ్రెస్ అంటేనే బీసీ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఆ పార్టీకి మళ్లీ అవకాశమిస్తే ఎదురయ్యే పరిస్థితులను గుర్తు చేసుకుని ఆందోళన చెందుతున్నారు. కులంహకార నేతలకు బుద్ధి చెబుదామని ముక్తకంఠంతో తెలుపుతున్నారు. బీసీ బిడ్డకే మా సంపూర్ణ మద్దతు ఉంటుందని వారు స్పష్టం చేస్తున్నారు. కాసానికి బాసటగా నిలిచి చేవెళ్లలో విజయబావుటా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాసానికి పట్టం కట్టడంవల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్నారు. బీసీ కులాలన్నీ ఏకతాటిపైకి రావడమే కాకుండా..ఊరూరా సమావేశాలు నిర్వహించి బీసీలను చైతన్యపర్చాలని సూచిస్తున్నారు. చేవెళ్ల నుంచే బీసీల సాధికారతకు నాంది పలుకుదామని పిలుపునిస్తున్నారు.

- రంగారెడ్డి, మే 3 (నమస్తే తెలంగాణ)

మన ఓట్లు మనమే వేసుకుందాం..

ఇంతకాలం బీసీలను అగ్రవర్ణాల వారు ఓట్లు వేసే వారిగానే చూశారు. బీసీల్లో చైతన్యం వచ్చింది. మన ఓట్లు మనమే వేసుకుందాం. బీసీ నాయకుడైన కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకొని తీరుతాం. బీసీ కులాల ఐక్యతకు ఆయన ఎంతో కృషి చేశారు. అలాంటి వ్యక్తి ఏ పార్టీ నుంచి చేవెళ్ల ఎంపీ బరిలో ఉన్నారనేది ముఖ్యం కాదు. బీసీ నేతగా గెలిపించుకునే బాధ్యత ప్రతి బీసీ బిడ్డపైనా ఉన్నది. బీసీని గెలిపించుకొని బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం.

వెంకటేశ్‌గౌడ్, నాగారం, ధారూరు మండలం.

బీసీ బిడ్డను పార్లమెంట్‌కు పంపిద్దాం..

పార్లమెంట్‌లో బీసీల గళం విప్పేందుకు ఈ లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి. చేవెళ్ల నుంచి చాలా ఏండ్ల తరువాత బీసీ నేతకు పోటీ చేసే అవకాశం వచ్చింది. దీన్ని బీసీలందరం సద్వినియోగం చేసుకుని పార్టీ లకతీతంగా కాసానిని గెలిపించుకుందాం. బీసీలను చిన్న చూపు చూసే నాయకులకు సరైన గుణపాఠం చెబుతాం.

రమేశ్, నాగారం గ్రామం, ధారూరు మండలం

జ్ఞానేశ్వర్ గెలుపు.. బీసీ ఐక్యతకు మలుపు

చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు వెనుకబడిన కులాల అభివృద్ధికి మలుపు. బడుగు, బలహీన వర్గాల గొంతుకైన జ్ఞానేశ్వర్‌కు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎంపీ టికెట్ ఇవ్వడం అభినందనీయం. అన్ని కులాల వారు పార్టీలకతీతంగా ఓట్లు వేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలి. అధికారంలో ఉన్న పార్టీలోకి జంపింగ్ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని ఎవరూ నమ్మొద్దు. ఇప్పటికే కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు పడుతున్నాం. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసానిని గెలిపించుకుంటే మన హక్కులను మనం సాధించుకోవచ్చు. ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేయాలి

– రాంగోపాల్, సిరిగాయపల్లి గ్రామం, పూడూరు మండలం

బీసీలను ఏకం చేశాడు..

2006లోనే 96 బీసీ కులాలను ఏకం చేసిన నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్. జడ్పీచైర్మన్‌గా పని చేసి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. అలాంటి నాయకుడికి చేవెళ్ల పార్లమెంట్ నుంచి ఎంపీ టికెట్‌ను కేసీఆర్ కేటాయించడం సంతోషకరం. బీసీలందరం పార్టీలకతీతంగా ఏకమై.. బడుగు, బలహీన వర్గాల నేతను పార్లమెంట్‌కు పంపిద్దాం. కారు గుర్తుకే ఓటేద్దాం.

– జె.నర్సింహులు,రాకంచర్ల గ్రామం,పూడూరు మండలం

బీసీల సత్తా చాటుతాం..

లోక్‌సభ ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకొని బీసీల సత్తాను చాటుతాం. ఎన్నో ఏండ్లుగా బీసీలు ఓటు బ్యాంకుగానే మిగిలిపోయారు. రాజకీయాల్లో రాణించేందుకు అవకాశాలు రాలేదు. ఈసారి చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా బీసీ బిడ్డ అయిన కాసాని జ్ఞానేశ్వర్‌కు ఆ అవకాశం వచ్చింది. దీనిని సద్వినియోగం చేసుకోవాలంటే కాసానికి ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి.

– సుమన్ జీ, దుగ్గాపూర్ గ్రామం, పెద్దేముల్

కాసానిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటాం..

ఈ ఎన్నికల్లో ఎవరూ ఎన్ని అడ్డంకులు సృష్టించినా చేవెళ్ల నియోజకవర్గం నుంచి బీసీ ముద్దుబిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం. అగ్రవర్ణాల వారు బీసీలను కొన్నేండ్లుగా ఓటు బ్యాంకుగానే చూస్తున్నారు. అలాంటి రాజకీయ నాయకులకు కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుతో గుణపాఠం నేర్పుతాం. బీసీల ఐక్యతను చాటుతాం. కాసాని గెలిస్తే సామాజికంగా బీసీలకు న్యాయం జరుగుతుంది.

– దస్తప్ప, దుగ్గాపూర్ గ్రామం, పెద్దేముల్

బీసీలంతా ఏకతాటిపైకి రావాలి..

లోక్‌సభ ఎన్నికల్లో బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి బీసీ నాయకుడిని గెలిపించుకోవాలి. బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థిగా బీసీనేత కాసాని జ్ఞానేశ్వర్‌కు అవకాశం ఇవ్వ డం సంతోషకరం. ఆయన బీసీ కులాలను ఏకతాటిపైకి తీసుకొచ్చారు.

– కల్వకోల్ వెంకట్‌యాదవ్, మాజీ సర్పంచ్ షాబాద్

చేవెళ్ల గడ్డపై గులాబీ జెండాఎగురేద్దాం..

లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై గులాబీ జెండాను ఎగురవేయాలి. కాంగ్రెస్, బీజేపీలు బీసీలను పట్టించుకోవడంలేదు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించడం గొప్ప పరిణామం. కాసాని జ్ఞానేశ్వర్ జడ్పీచైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభ్యున్నతికి ఎంతో కృషి చేశారు. అలాంటి వ్యక్తి పార్లమెంట్‌కు వెళ్తే బడుగు, బలహీనవర్గాలతో అన్ని వర్గాల సమస్యలు పరిష్కారమవుతాయి.

– కందివనం నర్సింహులుగౌడ్, మన్‌మర్రి(షాబాద్)

బీసీలు చైతన్యం చాటాలి..

బీసీలు చైతన్యం చాటే సమయం ఆసన్నమైనది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకునేందుకు బీసీ కుటుంబాలు తమ ఓటును తమకే వేసుకోవాలి. బీసీలు అమ్ముడుపోతారని, బీసీల్లో ఐక్యతలేదని, వారు ఎప్పుడూ ఒక్కటిగా ఉండలేరన్న వాదనకు తెరపడాలంటే కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి. చేవెళ్ల పార్లమెంటు స్థానాన్ని మాజీ సీఎం కేసీఆర్ బీసీ వర్గానికి చెందిన కాసానికి కేటాయించడం సంతోషకరం.

– టి.ప్రేమ్‌గౌడ్, మైలార్‌దేవ్‌పల్లి

కాసాని.. ప్రజల మనిషి

బీసీల ముద్దు బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు ప్రజల్లో మంచి గుర్తింపు ఉన్నది. ఆయన జడ్పీచైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారు.అలాంటి వ్యక్తిని లోక్‌సభకు పంపిస్తే మన సమస్యలను పార్లమెంట్‌లో వినిపిస్తారు.చేవెళ్ల గడ్డపై బీసీ నేతకు వచ్చిన అవకాశాన్ని మనమంతా వినియోగించుకుని పార్టీలకతీతంగా కాసానిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– యంజాల శేఖర్, పద్మశాలిపురం, మైలార్‌దేవ్‌పల్లి

అహంకారపూరిత మాటలు సరికాదు..

బీసీలకు ఎన్నికల్లో సీట్లు ఇవ్వకపోగా..వారిపై అహంకారపూరితంగా మాట్లాడడం కాంగ్రెస్ నాయకులకు సరికాదు. బీసీలందరూ ఏకతాటిపైకి వచ్చి ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలి. అప్పుడే బీసీల ఐక్యత సమాజానికి చాటినట్లు అవుతుంది. ఇలాంటి అవకాశం మళ్లీ రాదు. కేసీఆర్ బీసీ వర్గానికి పెద్దపీట వేసి బీసీలకు లోక్‌సభ సీట్లు కేటాయించడం సంతోషకరం. ప్రతి బీసీ బిడ్డా ఓ సైనికుడై బీసీ నాయకుడి గెలుపునకు కృషి చేయాలి.

– ప్రీతి, మియాపూర్

బీసీ నాయకుడికి పట్టం కడుదాం..

జనాభాలో బీసీలు అధికంగా ఉన్నా రాజకీయాల్లో ప్రాధాన్యం లభించడంలేదు.ఎన్నో ఏండ్లుగా అగ్రవర్ణాల వారు బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారు. చాలా రోజుల తరువాత బీసీ నాయకుడిని గెలిపించుకునే అవకాశం వచ్చింది. ఈ ఎన్నికల్లో బీసీలందరూ పార్టీలకతీతంగా బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్ భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి. బీసీల సత్తా చాటుదాం.

– భగత్‌కుమార్, మియాపూర్

బీసీలు ఏకతాటిపైకి రావాలి

బీసీలంతా పార్టీలకతీతంగా ఏకతాటిపై వచ్చి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలి. పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం పోరాడేది ఒక్క బీఆర్ఎస్ పార్టీ ఎంపీలే. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎంతోకాలంగా కృషి చేస్తున్న ఆయన్ను గెలిపించుకుంటే బీసీల సమస్యలపై పార్లమెంట్‌లో మాట్లాడుతారు. బీసీ సామాజిక వర్గానికి ఎంపీ టికెట్ కేటాయించిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు. కాంగ్రెస్, బీజేపీలు బీసీలపై చిన్న చూపు చూస్తున్నాయి.

– శివకుమార్‌గౌడ్, ఎన్టీఆర్‌నగర్, ఆర్కేపురం

కాసాని గెలుపును ఎవరూ ఆపలేరు..

చేవెళ్లలో కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి బీసీల ఐక్యత, సత్తాను చాటుతాం. బీసీలకు బీఆర్ఎస్ పార్టీ మాత్రమే పెద్దపీట వేసింది. ఎంపీ టికెట్‌ను కేటాయించింది. ఇలాంటి అవకాశం మళ్లీరాదు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని జిమ్మికులు చేసినా జ్ఞానేశ్వర్ గెలుపును ఆపలేరు. బీసీలను కించపరుస్తూ మాట్లాడిన అగ్రవర్ణ నాయకుడికి తగిన బుద్ధి చెప్పాలంటే జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి బీసీపైనా ఉన్నది.

– సంతోష్, ఆర్కేపురం

సప్లిమెంటరీ పరీక్షల్లో ..

ఉత్తీర్ణతాశాతాన్ని పెంచాలి

● ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్

ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న ఇంటర్మీడియట్ విద్యాధికారి

వికారాబాద్, మే 3: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన వికారాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణతాశాతాన్ని పెంచాలన్నారు. వార్షిక ఫలితాలు, కళాశాలల్లో మౌలిక వసతులపై సమీక్ష నిర్వహించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్వరస్వామిని ఆయన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ రాజమోహన్, చెన్నయ్య, నర్సింహారెడ్డి, కుమారస్వామి, సురేశ్వరస్వామి, మంజుల, నర్సింహులు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కార్యాలయ సిబ్బంది వినోద్, సలీమాబేగం, ఇందిరమ్మ పాల్గొన్నారు.

ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలి

మాల్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి

యాచారం, మే 3 : ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం మండలంలోని మాల్ గ్రామంలో సీఐ శంకర్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఇందులో ఆర్డీవో అనంతరెడ్డి, ఏసీపీ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మండలంలోని ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు, ఓటర్ల స్వేచ్ఛకు భరోసా కల్పించేందుకు సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో ఎవరైనా చట్టవిరుద్ధమైన కార్యక్రమాలకు పాల్పడితే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహన తనిఖీలను మరింత ముమ్మరం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటనారాయణ, గోపాల్, పోలీసులు పాల్గొన్నారు.

నేటినుంచి జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, మే 3 : వికారాబాద్ జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని శుక్రవారం నుంచి మే 30 వ వరకు 30, 30(ఏ) పోలీస్ యాక్ట్ 1861 అమల్లో ఉంటుందని ఎస్పీ కోటిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసుల ముం దస్తు అనుమతి లేకుండా ప్రజలు, ప్రజాప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యా లీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించొద్దని.. ఎవరైనా నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా..

ఈతకెళ్లి బావిలో పడి బాలుడి మృతి

రామకృష్ణ (ఫైల్)

చేవెళ్ల రూరల్, మే 3 : ఈత సరదా ప్రాణాలు తీసింది. మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామానికి చెందిన ఎదిరె విఠలయ్య, లక్ష్మి దంపతుల కుమారుడు రామకృష్ణ (నాని), 16 ఏండ్లు. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో గ్రామానికి చెందిన స్నేహితులతో కలిసి సరదాగా గ్రామంలోని ఓ బావిలో ఈతకు వెళ్లాడు. ఈత కొడుతున్న క్రమంలో రామకృష్ణ నీటిలో మునిగిపోయాడు. తోటి స్నేహితులు గమనించి తల్లిదండ్రులు, గ్రామస్తులకు సమాచారమిచ్చారు. బావిలోని నీటిని తొలగించి అతడి మృతదేహాన్ని బయటికి తీశారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

తెలుగు వర్సిటీలో మే 10 నుంచి..

ఫిల్మ్ యాక్టింగ్ శిక్షణా తరగతులు

తెలుగు యూనివర్సిటీ, మే 3: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ వేసవి సెలవుల్లో నిర్వహించే ఫిల్మ్ యాక్టింగ్ శిక్షణా తరగతులకు నటనపై ఆసక్తి గల ఔత్సాహికుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణలో చేరాలనుకునే వారు పదో తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. మే 10వ తేదీ నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని.. కోర్సు ఫీజుగా రూ.5వే లు చెల్లించాలన్నారు. 30 రోజుల శిక్షణ అనంతరం అభ్యర్థులకు సర్టిఫికెట్ ఇస్తామన్నారు. వివరాలకు 9346461733 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ట్రాన్స్ జెండర్లకు ఓటింగ్‌పై అవగాహన

షాబాద్, మే 3: ట్రాన్స్‌జెండర్లకు ఓటింగ్‌పై అవగాహన, సర్టిఫికేషన్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఈ నెల 7న సరూర్‌నగర్‌లో జిల్లా మహిళా సాధికారిక కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డిజిల్లా సంక్షేమశాఖ అధికారిణి పద్మజారమణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్ల సర్టిఫికేషన్ రిజిస్ట్రేషన్‌కు కావాల్సిన పత్రాలను క్వీర్‌బంధు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు ముకుందమాల ఉచితంగా అందజేస్తారన్నారు. పూర్తి వివరాలకు 9603525866 శ్రీకాంత్, విజయభాస్కర్ 9160144144 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

నైపుణ్యాన్ని పెంచుకుంటే

మెరుగైన అవకాశాలు